# కుంటి కాళ్ళు



సంక్రాంతి సెలవులిచ్చేరు. పండక్కి రమ్మని అత్తవారు పిలిస్తే పది రోజుల క్రిందనే శ్రీమతిగారు ఉడాయించేసేరు. మరి నేనిప్పుడు బయల్దేరేను.

బస్సు రావడానికింకా ఓ అరగంట పైముంది. బస్టాండంతా పండుగనాటి అత్తారిల్లులా వుంది. మంచుతెరలు చీల్చుకుంటూ కొత్తల్లుడిలా సూర్యుడు ధగధగ మెరిసిపోతున్నాడు. చలిచలిగా ఉన్న ఆ సమయంలో సూర్యకిరణాలు తగలగానే అదోరకమైన గిలిగింతలు పెడుతున్నాయి.

స్టార్టుచేసిన బస్సుల మోతతోనూ, హారన్ల రొదతోనూ చెవులు దిబ్బెళ్ళు పడిపోతున్నాయి. అప్పుడేవచ్చి ఆగుతున్న బస్సుల్లోంచి అత్తారింట్లో అరిసెలు దక్కవేమోనన్నంత ఆత్రుతగా ప్రయాణీకులు తోసుకుంటూ దిగేస్తున్నారు. పేపరు కుర్రాళ్ళు పేపర్లు అంటగట్టడానికి ప్రయత్నిస్తున్నారు టీ కెటిల్స్‌తో కొంత మంది అటూ ఇటూ తిరుగుతూ 'వేడివేడి చాయ్' అంటూ ఊరిస్తున్నారు. మరింక ఊళ్ళపేర్లని దండకం వల్లిస్తున్నాడు మరొహాడు.

ఈ హడావిడి మధ్యనున్నవాడు ఆకర్షించేడు. టక్కుటక్కుమని నేలని కర్రతో తాకుతూ, గెంతుతూ బస్సు డోర్‌మీద దబ్బుదబ్బునకొట్టూ "రై... రైట్" అని కేకేస్తున్నాడువాడు. వీణ్ణి... ఎక్కడ చూసాను చెప్మా అంటూ దీక్షగా చూస్తూంటే... వాడు నా పక్కకే గెంతుకుంటూ వస్తున్నాడు.

"నేను... చందుగాణ్ణి... బాగున్నావా ?" అంటూ వాడే పలకరించేసరికి అవాక్కయిపోయేను.

"ఒరే... నువ్వు... చందుగాడివా..." అంటూ ఆశ్చర్యంతో ఆనందపడిపోయేను. వెంటనే వాడి అవిటితనానికి విచారమూ, జాలీ కలిగేయి.

"ఊఁ... బాగున్నానా" అన్నాడు వాడు.

"బాగున్నానుగాని... నువ్వేవిట్రా చందూ...ఏం జరిగింది?..." అనబోతున్నాను... నాముందే నేనెక్కాల్సిన బస్సు దూసుకుని వెళ్ళి అంత దూరంలో ఆగింది.

"సరే వస్తాను... తిరిగి వచ్చేటప్పుడు వివరాలు చెప్పాగాని..." అంటూ బస్సెక్కేను.

పరిగెడుతూన్న బస్సులో నేను... సినిమా తెరలా కిటికీ... పరుగులిడుతున్న చెట్లూ, చేమలూ, కొండలూ, కోనలూ చూపెడుతోంది అది. కాసేపటికి నా మనసులోని ఆలోచనలనే అది ప్రతిబింబించడం మొదలెట్టింది...

నేనూ, చందూ చిన్నప్పుడు ఒకే బడిలో చదువుకున్నాం. మా ఇద్దరివీ దగ్గర దగ్గర ఇళ్ళే కావడంవల్ల కలిసేవెళ్ళి కలిసే వచ్చేవాళ్ళం.

చందూ... నల్లగా నిగనిగలాడుతూ, బలంగా, హుషారుగా ఉండేవాడు. ఆటల్లోనూ అల్లరిలోనూ వాడిదే పైచేయి. మరి నేనో సన్నగా, నీరసంగా ఉండేవాణ్ణి. అయినా చదువులో బాగా వుండేవాణ్ణి.

మేస్టారిచేత దెబ్బలు తినని రోజంటూ ఉండేదికాదు వాడికి. ఎన్ని దెబ్బలుతిన్నా ఆ ఒక్క క్షణమే... ఆట స్థలంలో వాడి చురుకుదనం, చెలగాటం చెప్పనలవికాదు. దొంగాటలో వాడిని పట్టుకోవడమంటే పిల్లలందరికీ ప్రాణాంతకం. ఆటల్లో వాడికి పేరు తెచ్చే ఆట కుంటికాలు ఆట. ఆ ఆటలో వాడు రాజు. వాడు కుంటుకుంటూ పరిగెడితే క్షణంలో అందరూ ఔటయిపోయి కోర్టు క్లీనయిపోయేది.

ఆ బళ్ళో చదువు పూర్తయ్యేసరికి...ఏడైనా

పనిలో వాణ్ణి పెడితే గాని కుటుంబం జరగని స్థితి రావడంతో వాళ్ళ నాన్న బడిమానిపించేడు. వాడికీ చదువంటే ఆసక్తి లేదు.

కొన్నాళ్ళు హోటల్లోనూ, మరికొన్నాళ్ళు సైకిలు షాపులోనూ, ఇంకొన్నాళ్ళు మోటారు షెడ్‌లోనూ పని చేస్తూ౦డగా వాణ్ణి చూసేను. చివరికి బస్ క్లీనర్‌గా స్థిరపడ్డ యువకుడిగా చందూని గుర్తి౦చేను.

అప్పటికి హైస్కూల్లో బడి పంతులుగా రూపుమార్చుకుని ఇంకా బడికి వెళ్తూ౦డటం చూస్తూ... ఫుట్‌బోర్డు మీద ఒంటి కాలితో నిల్చుని తలుపుమీద దబ్బునకొడుతూ 'రై .రైట్' అని ఓ వైపు అరుస్తూనే ''బడికా .'' అని అడిగేవాడు చందూ.

ఫుట్‌బోర్డు మీంచి ఒక్క ఊపుతో డోర్ మీదికి, అక్కడి నుండి టాపుమీదికి, చెంగున గెంతి లగేజి అందుకునే చందూని చూస్తూ౦టే ఒక్కోసారి భయం కలిగేది.

నా భయం వ్యక్త౦ చేద్దామనుకున్నాను. కాని వాడి తత్వం నాకు తెలుసు. ప్రమాదాన్ని ఎదుర్కోవటంలో ఎంతో థ్రిల్ ఉంటుందనీ, ఇటువంటి థ్రిల్సుంటే జీవితం నిర్భయంగా కొనసాగుతుందనీ వాడి నమ్మకం.

మా అత్తవారి ఊరు దగ్గరకు వచ్చేసరికి బస్సు కిటికీమీద ఒంటికాలితో నిల్చున్న బస్ క్లీనర్— స్టిల్ ఫోటోగ్రాఫ్‌లా చెరగని ముద్ర



వేసేసింది నా మనస్సుమీద.

పండగ నాల్గురోజులూ అత్తవారింట్లో నాల్గుక్షణాల్లో గడిపేసి తిరుగుముఖం పట్టేను.

బస్ దిగుతూనే చందూగాడి కోసం నాకళ్ళు వెదికేయి. అల్లంత దూరాన టీకొట్టు దగ్గర నుండి చేయెత్తి పిలుస్తున్నాడువాడు. ''స్ట్రాంగ్ టీ... రెండు...'' అంటూ కేకేసేడుకూడాను.

టీ సిప్‌చేస్తూన్నంత తేలిగ్గా వాడు వాడికి జరిగిన ప్రమాదాన్ని చెప్పేడు...

ఆ రోజు —

బస్‌లో బంపర్ రష్... తన వాటాకి ఎలా లేదన్నా పాతిక రూపాయలిస్తాడు కండక్టర్... మ్మరి హుషారు కంతులేకపోయింది. డోర్‌పట్టుకు వేలాడుతూ ఈలకొడ్తున్నాడు... ముందు వెళ్తున్న ఎడ్లబండి గజలక్ష్మిలా కదుల్తూ వెనికపడ్డ బస్సుని ఓరకంటితో చూసి బెంబేలెత్తి పోయింది. అంతే సడన్‌గా వేసిన బ్రేకు— చందూగాణ్ణి విసిరేసింది. ఆ పడడం పడడం ముందుచక్రం ముందుపడి చక్రాన్ని భరించేసింది వాడి కాలు.

ఆనాడు ఆటలో సరదాకోసం కుంటివాడై గెలిచేడు ఈనాడు జీవితంలో కుంటివాడై... లేదులేదు ఓడిపోలేదు. వాడి ముఖంమీద ఎప్పటికీ చెరగని చిరునవ్వే. .

నా కళ్ళు చెమర్చేయి.

బస్సు యజమానులకు లాభాలమీద లాభాలు చేకూర్చడంకోసం... అలా చేకూరుస్తే తమకు వచ్చే పాతికా పరకా కోసం ఓవర్‌లోడ్ చేసేస్తూ ఆశపడుతూనే ఉంటారు బక్క జనం... కాని వాడి ప్రాణాలు పోయినాసరే లాభంలోంచి ఒక్క పైసా ఎక్కువ ఇవ్వడానికి కూడా ప్రాణం పోతుంది యజమానికి. ఇటువంటి తత్వాలు తెలుసుండీ యజమాని ఒక్క మంచిమాట చెప్తే పొంగిపోయే పనివాళ్ల వర్గానికి చెందినవాడు చందూ. .

సంబరపడుతూ చెరగని చిరునవ్వుతో ఉండే చందూని చూసి నేను విచారించనవసరం లేదు ఈనాడు కూడా వాడి కుంటికాలే అతన్ని నిలబెడుతోంది ★

పి. ఈశ్వర్రావు